క్లుప్తంగా

సూపరింటెండెంట్‌గా కేశవ్ నియామకం



కూడేరు: ఎంపీడీఓ కార్యాలయ పరిపాలనా అధికారి (ఏఓ)గా కేశవ్‌ను ఉన్నతాధికారులు నియమించారు. దీంతో గురువారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈయన పెద్దవడుగూరు మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న నాగభూషణ రెడ్డి శింగనమల మండలానికి బదిలీపై వెళ్లారు.

డీటీగా లక్ష్మీనరసింహులు బాధ్యతల స్వీకరణ



కంబదూరు: మండల నూతన డిప్యూటీ తహసీల్దార్‌గా లక్ష్మీనరసింహులు నియమితులయ్యారు. ఇక్కడ పని చేస్తున్న నారాయణస్వామి గుంతకల్లుకు బదిలీ అయ్యారు. దీంతో ఆయన స్థానంలో రాప్తాడు తహసీల్దార్ కార్యాలయంలో డీటీగా విధులు నిర్వర్తిస్తున్న లక్ష్మీనరసింహులు ఇక్కడికి బదిలీపై వచ్చారు. గురువారం ఆయన డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు.

ఎంపీడీఓ బదిలీ

గుమ్మఘట్ట: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఉన్న నరసింహమూర్తి లేపాక్షికి బదిలీ అయ్యారు. పెద్దపప్పూరు నుంచి రామకృష్ణ బదిలీపై ఇక్కడికి రానున్నట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి.

ఎంఈఓగా మహమ్మద్ గౌస్



కూడేరు: మండల విద్యాధికారిగా మహమ్మద్ గౌస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంఈఓగా పని చేస్తున్న చంద్రశేఖర్ ఏసీబీకి పట్టుపడడంతో ఆయన్ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. పోస్టు ఖాళీ అయింది. అనంతపురంలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న మహమ్మద్ గౌస్‌కు ఎంఈఓగా బాధ్యతలు అప్పగించారు.

ఎక్సైజ్ సీఐగా ఉమా బాయి



కణేకల్లు: కణేకల్లు ఉమా బాయి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పని చేస్తున్న మురళీకిషోర్ కొడికొండ చెక్‌పోస్టుకు బదిలీ అయ్యారు. రాయచోటిలో పని చేస్తున్న ఉమా బాయిని కణేకల్లుకు బదిలీ చేశారు. ఎక్సైజ్ సిబ్బంది కొత్త సీఐకు శుభాకాంక్షలు తెలిపారు.

హౌసింగ్ ఏఈగా గోపిచంద్‌నాయక్



బెళుగుప్ప: మండల హౌసింగ్ ఏఈగా గోపిచంద్‌నాయక్ గురువారం బాధ్యతలు చేపట్టారు. హౌసింగ్ ఏఈ శివారెడ్డి అనంతపురానికి బదిలీ కావడంతో విడపనకల్లు మండల హౌసింగ్ ఏఈగా ఉన్న గోపిచంద్‌నాయక్ బెళుగుప్పకు బదిలీ అయ్యారు.

డీటీగా శ్యామ్ రాయ్



బొమ్మనహాళ్: కళ్యాణదుర్గం ఆర్డీవో కార్యాలయంలో డీటీగా పనిచేస్తున్న శ్యామ్ రాయ్ బొమ్మనహాళ్ డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా హనుమంతు నాయక్ గురువారం బాధ్యతలు చేపట్టారు.

వీఆర్వోలు బదిలీ : బొమ్మనహాళ్ మండలంలో ముగ్గురు వీఆర్వోలు బదిలీ అయిన్నట్లు తహసీల్దార్ మునివేలు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎలంజి వీఆర్వో హరిప్రసాద్ రాయదుర్గం మండలం నాగిరెడ్డిపల్లికి, బొమ్మనహాళ్ వీఆర్వో తిమ్మప్ప, రాయదుర్గం మండలం చదం గ్రామానికి, ఉంతకల్లు వీఆర్వో వన్నూరప్ప ఇక్కడికి బదిలీ అయినట్లు తెలిపారు.

నూతన విద్యుత్ ఏఈగా మహమ్మద్ సలీం



శెట్టూరు:స్థానిక ఏఈ కార్యాలయంలో గురువారం నూతన విద్యుత్ ఏఈ మహమ్మద్ సలీం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఏఈగా పని చేస్తున్న జయకృష్ణ మరో ప్రాంతానికి బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏఈ మహమ్మద్ సలీంను సిబ్బంది అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

మున్సిపల్ ఏఈగా నరసింహులు



రాయదుర్గంటౌన్: రాయదుర్గం మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీరింగ్‌గా బి.నరసింహులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు జిల్లా గూడూరు మున్సిపాలిటీలో ఏఈగా పని చేస్తున్న ఇతన్ని ఇక్కడికి బదిలీ చేశారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డికి జాయినింగ్ ఉత్వర్తులు అందజేశారు. కర్నూలు కార్పొరేషన్ నుంచి డీఈ, ధర్మవరం నుంచి మరో ఏఈని ఇక్కడికి బదిలీ చేయగా, ఆయన బాధ్యతలు తీసుకోవాల్సి ఉందని కమిషనర్ తెలిపారు.

షాడో ఎమ్మెల్యేగా ధర్మతేజ..?
- అధికారులతో అనధికార సమీక్షలు
- సొంత పార్టీ నేతలకు తలనొప్పిగా మారిన అమిలినేని అల్లుడి వ్యవహారశైలి
- విస్మయం చెందుతున్న పార్టీ శ్రేణులు

అల్లుడా మజాకా!



ఈనెల 2న కళ్యాణదుర్గంలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ అధికారిక కార్యక్రమంలో ఎమ్మెల్యేకు బదులుగా హాజరైన అమిలినేని మేనల్లుడు ధర్మతేజ (వృత్తంలో ఉన్న వ్యక్తి)

కళ్యాణదుర్గం: మామ ఎమ్మెల్యే.. అల్లుడు అన్నీ తానై అధికార దర్పం ప్రదర్శిస్తున్నాడు. అధికారులు నాయకులపై పెత్తనం చెలాయిస్తున్నాడు. కళ్యాణదుర్గంలో కూటమి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అల్లుడు ధర్మతేజ వ్యవహార శైలి విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వ అధికారులతో అనధికార సమీక్షలు నిర్వహిస్తూ తానే ఎమ్మెల్యే అయినట్లు వ్యవహరిస్తుండటం ప్రజలను విస్మయానికి గురి చేస్తోంది. నియోజకవర్గంలోని మారుమూల గ్రామంలో ఏ చిన్న సమస్య జరిగినా నేరుగా ధర్మతేజ వద్దకు రావాలంటూ అటు పార్టీ పెద్దలు, ఇటు ఎమ్మెల్యే సైతం చెప్పుండడంతో సీనియర్లుగా ఉన్న పార్టీ నేతలకు కూడా ధర్మతేజ వ్యవహార శైలి తలనొప్పిగా మారింది.

ఉద్యోగుల బదిలీలను మొదలుకొని.... :
రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఉద్యోగుల బదిలీల ప్రక్రియను చేపట్టింది. కళ్యాణదుర్గం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే వారికి, ఇతర ప్రాంతాల నుంచి కళ్యాణదుర్గం నియోజకవర్గానికి వచ్చే ఉద్యోగులు సైతం ఎమ్మెల్యే సిఫార్సు తప్పనిసరి అంటూ ధర్మతేజ అన్నీ తానై బదిలీల్లో చక్రం తిప్పినట్లు పలువురు ఉద్యోగులు వాపోతున్నారు. ఇదీకాక గ్రామాల్లో డీలర్లు, యానిమేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వాటర్ షెడ్ కమిటీ చైర్మన్లు తదితర గ్రామ స్థాయి పదవులను ధర్మతేజ చెప్పిన వారికే కట్టబెట్టేలా అధికారులపై ఒత్తిళ్లు తెచ్చినట్లు సమాచారం.

షాడో ఎమ్మెల్యేగా సమీక్షలు..
వాస్తవానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు గురువారం అందుబాటులో లేరు. నియోజకవర్గంలోని పంచాయతీ కార్యదర్శులను ప్రజావేదిక వద్దకు పిలిపించుకొని ధర్మతేజ షాడో ఎమ్మెల్యేగా సమీక్ష నిర్వహించడంపై చర్చ సాగింది. వైఎస్సార్ సీపీ పాలనలో నియోజకవర్గంలోని 74 గ్రామ పంచాయతీలలో జరిగిన అభివృద్ధి పనుల వివరాలు, ఖర్చు చేసిన నిధులు, పెండింగ్ బిల్లుల వివరాలపై ఆరా తీశారు. పూర్తి వివరాలను కూడా ఐదు రోజుల్లో తనకు అందజేయాలని హుకుం జారీ చేయడం చర్చనీయాంశమైంది.

సొంత పార్టీ నేతలకు తలనొప్పిగా మారిన వైనం..
నియోజకవర్గంలో షాడో ఎమ్మెల్యే వ్యవహార శైలి టీడీపీ నేతలకు తలనొప్పిగా మారిందనే విమర్శలు వస్తున్నాయి. కొన్నేళ్లుగా పార్టీ నేతలుగా ఉన్న సీనియర్లను ఆయా గ్రామ పంచాయతీల పనుల్లో పక్కనపెట్టినట్లు సమాచారం. దీంతో సీనియర్లు కొందరు ధర్మతేజ వ్యవహార శైలి నచ్చక పార్టీకి దూరంగా ఉంటున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే రానున్న రోజుల్లో ఇసుక రవాణా, మద్యం షాపుల టెండర్ల విషయమై టీడీపీ నేతల్లోనే భేదాభిప్రాయాలు వచ్చే అవకాశం కూడా లేకపోలేదు. ఏది ఏమైనా నియోజకవర్గంలో అభివృద్ధికి పాటుపడుతానని ప్రజలను నమ్మించి, ఓట్లు వేయించుకున్న అమిలినేని సురేంద్రబాబు కాకుండా ఆయన బంధువులు రాజకీయం చేస్తూ పెత్తనం చెలాయించడంపై అటు ప్రజలతో పాటు సొంత పార్టీలోనే విస్మయం కలుగుతోంది.

టార్గెట్ పేరుతో వేధింపులు ఆపాలి



కంబదూరులో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేస్తున్న తపాలా ఉద్యోగులు

కంబదూరు: టార్గెట్ పేరుతో గ్రామీణ తపాలా ఉద్యోగులపై జరుగుతున్న వేధింపులు ఆపాలని అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘాలు, ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తపాలా కార్యాలయం ఎదుట డిమాండ్లను పరిష్కరించాలని తపాలా ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ఈ నిరసన కార్యక్రమం ఈనెల 5 వరకు జరుగుతుందని వారు తెలిపారు.

చిరస్థాయిగా నిలిచిపోయేది సేవలే



వజ్రకరూరులో గ్రామ కార్యదర్శి శ్రీధర్‌రావును సన్మానిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: ఉద్యోగుల సేవలే చిరస్థాయిగా నిలిచిపోతాయని వక్తలు పేర్కొన్నారు. గురువారం స్థానిక మేజరు పంచాయతీ కార్యాలయంలో గ్రామ కార్యదర్శి శ్రీధర్‌రావు, వీఆర్వో అరుణ తదితరులు బదిలీపై వెళ్తున్న సందర్భంగా వారిని సన్మానించారు. ఎంపీపీ రమావత్‌దేవి, సర్పంచులు మోనాలిసా, మల్లెల జగదీష్ మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు సహజమేనన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఫిరోజ్‌బాను, సామాజిక కార్యకర్తలు బెంజిమెన్, మల్లికార్జున, మైనార్టీ విభాగం నాయకుడు ఖాజాపీరా, సచివాలయ ఉద్యోగులు, పంచాయతి సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శభాష్.. సుధాకర్

- 9 ఎకరాల మిర్చి పంటలో 8 గంటల్లోనే నూట్లు పూర్తి



యువరైతు సుధాకర్‌ను అభినందిస్తున్న రైతులు

ఉరవకొండ: మండలంలోని రాకెట్ల గ్రామానికి చెందిన యువరైతు నిమ్మగంటి సుధాకర్ ఎనిమిది గంటల్లో 9 ఎకరాల మిర్చి పంటలో కలుపు తొలగించేందుకు గుంటక (172 సాళ్లు) పాసి ఔరా అనిపించుకున్నాడు. యువరైతును గ్రామ రైతులు, ప్రజలు అభినందించారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి



ఎన్.తిమ్మాపురంలో రైతులకు పంటల సాగుపై మెలకువలు తెలియజేస్తున్న అధికారులు

కూడేరు: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి సాధించొచ్చని వ్యవసాయాధికారి విజయ కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని చోళసముద్రం, జయపురం గ్రామాల్లో వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ మేలైన యాజమాన్య పద్ధతుల్లో పంటలు సాగు చేయాలని రైతులకు తెలియజేశారు. ఒకే రకం పంటలు సాగు చేస్తే నేలలో భూసారం తగ్గి దిగుబడి అంతంత మాత్రంగానే ఉంటుందన్నారు. ఆముదం పంటకు వచ్చే తెగుళ్ల నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రమాదేవి, ఏఓ విజయ కుమార్, పట్టు శాఖ టీఏ శ్రీనివాసులు, వీహెచ్‌ఏ గంగాద్రి, బీఏహెచ్‌ఏ సుబ్బరాయుడు, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది హరి, వల్లబ్, సుధీర్, రైతులు పాల్గొన్నారు.

ఎన్.తిమ్మాపురంలో..
విడపనకల్లు: మండల పరిధిలోని ఎన్.తిమ్మాపురం గ్రామంలో మండల వ్యవ సాయాధికారి పెన్నయ్య ఆధ్వర్యంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ రైతులతో కలసి కంది పంటను పరిశీలించి, పంట సాగులో తీసుకోవాల్సిన మెలకువలపై రైతులకు తెలియజేశారు. పంట నమోదు వంద శాతం పూర్తి చేయాలని సూచించారు. పప్పుశనగ కోసం రైతులు రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని 25 శాతం సబ్సిడీతో పప్పుశనగ విత్తనాన్ని రాష్ట్రం ప్రభుత్వం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ రాఘవేంద్ర, తదితర రైతులు పాల్గొన్నారు.

మంత్రి ఇలాఖాలో జరిగిన మంచి ఇదేనా?

- వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ రమణ



మాట్లాడుతున్న ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విరమణ

ఉరవకొండ: రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సొంత నియోజకవర్గంలో ప్రజలకు ఏం మంచి జరిగిందని వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ రమణ ప్రశ్నించారు. కూటమి వందరోజుల పాలనలో కేవలం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను టార్గెట్ చేస్తూ దాడులకు తెగబడటం, డీలర్లు, యానిమేటర్లు, ఆశా కార్యకర్తలను తొలగించి, వారి స్థానంలో టీడీపీ నాయకుల కుటుంబ సభ్యులను చేర్చడం అని ఇలా అనేక వైఫల్యాలు ఉన్నాయని ఆయన ధ్వజమెత్తారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ నియోజకవర్గానికి మంత్రి అయిన కేశవ్ మంచి చేస్తాడని ప్రజలు ఎంతో ఆశగా ఎదురుచూస్తుంటే.. ప్రజల ఆశలపై నీళ్లు చెల్లారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లో వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులు, పార్టీ నాయకులు, కార్యకర్తలను టార్గెట్ చేస్తూ జిల్లాలో ఎక్కడా లేని విధంగా దాడులు చేస్తూ విష సంస్కృతికి టీడీపీ నాయకులు ఆజ్యం పోశారాన్నారు. ఉరవకొండ మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ ఇంటిపై దాడి, పట్టణానికి చెందిన పార్టీ మైనార్టీ నాయకుల ఇంటిపై రాళ్ల దాడి చేయడం, మైనార్టీ నాయకులను బెదిరించడం, మోపిడి సర్పంచ్ పండ్ల మొక్కలను నరికి వేయడం, కమలపాడులో మాజీ సర్పంచ్ ద్విచక్ర వాహనానికి నిప్పుపెట్టడం, ఛాయపురంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకురాలును అవమానించడం, లత్తవరంలో ఉపసర్పంచ్‌పై దాడి.. ఇలా ఎన్నో బీభత్సాలు సృష్టిస్తున్నారన్నారు. ఈదాడులను టీడీపీ నాయకులే స్వయంగా చేసి బాధిత వైఎస్సార్‌సీపీ నాయకుల పైనే ఎదరు కేసులు పెట్టించారన్నారు. దాడులను మంత్రి కేశవ్ అరికట్టాల్సింది పోయి ప్రోత్సహిస్తున్నారన్నారు.

సచివాలయాలు, ఆర్‌బీకేలు ధ్వంసం:
టీడీపీ గుండాలు రూ.లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయాలు, ఆర్‌బీకేలను ధ్వంసం చేస్తు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని కేవీ రమణ అన్నారు. చిన్నముష్టూరులో ఆరోగ్యకేంద్రంపై దాడి చేసి శిలాఫలాలు ధ్వంసం చేసి, ఫర్నీచర్ ఎత్తుకెళ్లారన్నారు. కూడేరు మండలంలో కమ్మూరులో పంచాయతీ భవనంలోని శిలాఫలకాలు ధ్వంసం చేయడం, డీలర్లు, ఫీల్డ్‌అసిస్టెంట్‌లు, యానిమేటర్లు, ఆశాలను నిర్దాక్షిణ్యంగా తొలగించి, అయినవారిని నియమించుకోవడం చేస్తున్నారన్నారు. దీంతో పాటు అక్రమంగా మట్టి, మట్కా, పేకాట కేంద్రాలను నిర్వహించేందుకు మంత్రి అనుచరులే పోటీపడుతున్నారన్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు నిమ్మకునీరెత్తినట్లు ఉంటూ ఉంటూ ఒక్క ఘటనపై కూడా కేసు నమోదు చేయలేదన్నారు. మంత్రి కేశవ్ ఇచ్చిన హామీలను నెరవేర్చి ఉరవకొండ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడేలా కృషి చేయాలని హితవు పలికారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చంద్రమ్మ, పార్టీ నాయకులు బసవరాజులు పాల్గొన్నారు.

వైభవంగా పద్మావతి వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు



స్వర్ణ మహాలక్ష్మీదేవిగా దర్శనమిస్తున్న పద్మావతి అమ్మవారు

బెళుగుప్ప: మండల పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రం బూదిగుమ్మ పద్మావతి వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఆలయంలో శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారు రోజూ ఒక అలంకరణలో ఈనెల 12 వరకు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఈనెల 12న సాయంత్రం 4గంటలకు పద్మావతి వెంకటరమణస్వామి రథోత్సవం జరగనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి అక్కిరెడ్డి తెలిపారు. అమ్మవారు స్వర్ణ మహాలక్ష్మీదేవిగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలిరోజున అమ్మవారు స్వర్ణ మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. పూజల్లో స్థానిక ఎంపీటీసీ వీరబొమ్మన్న, మాజీ ఆలయ కమిటీ చైర్మన్లు గోవిందరెడ్డి , మాణిక్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

రాయదుర్గంటౌన్/రాయదుర్గం: మండలంలోని కొంతానపల్లి వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. ఇందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం సర్వజన ఆస్పత్రికి రెఫర్ చేశారు. వివరాలు.. రాతిబావివంక కు చెందిన దంపతులు ఆంజనేయులు, జయలక్ష్మి, నరసింహులు ద్విచక్ర వాహనంపై రాయదుర్గం పట్టణం నుంచి స్వగ్రామానికి బయల్దేరారు. కొంతానపల్లికి చెందిన రాజు అనే వ్యక్తి వెనుకవైపున వెళ్తూ ముందువెళ్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టాడు. ఈ ఘటనలో నలుగురు కిందపడి గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను చికిత్స కోసం హుటాహుటినా రాయదుర్గం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇందులో జయలక్ష్మి, రాజు పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు అనంతపురానికి పంపారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ జయనాయక్ తెలిపారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం:
పట్టణంలోని సీబీఎన్ కాలనీకి చెందిన ఇంద్ర అనే యువకుడు గురువారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన బంధువులు చికిత్సకోసం హుటాహుటిన ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాల తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కనుల పండుగగా పల్లకీ ఉత్సవం



అలంకరణలో షిర్డీసాయి

వజ్రకరూరు: స్థానిక షిర్డీసాయి ఆలయంలో గురువారం పల్లకీ ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, తీర్థప్రసాదాలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. పల్లకీ ఉత్సవం అనంతరం రాత్రి శేజ్ హారతి భక్తిశ్రద్ధల తో నిర్వహించారు.

వీరశైవ రుద్రభూమిలో వసతులు కల్పించండి



వినతిపత్రం అందిస్తున్న వీరశైవసంఘం నాయకులు

ఉరవకొండ: పట్టణంలోని లత్తవరం రోడ్డు వద్ద సోమన్నకుంట పక్కన కేటాయించిన వీరశైవ రుద్రభూమిలో నీరు, విద్యుత్ సౌకర్యం తదితర మౌలిక వసతులు కల్పించాలని మేజర్ పంచాయతీ సర్పంచ్ లలితమ్మ, ఈఓ గౌస్‌సాహెబ్‌కు సంఘం నాయకులు గురువారం వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వీరశైవ సంఘం నాయకులు నిరంజన్‌గౌడ్, నాగన్నగౌడ్, గంగాధర్, మోపిడి చంద్ర మాట్లాడుతూ వీరశైవ రుద్రభూమిలో నీటి బోరు ఏర్పాటు చేసి విద్యుత్ స్తంభాలు, దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. దీంతో పాటు ప్రహరీ నిర్మించాలన్నారు.

రోడ్లపై ఆవులు సంచరిస్తే కఠిన చర్యలు

కళ్యాణదుర్గం రూరల్: మున్సిపాలిటీలోని ప్రధాన రోడ్లపై ఆవులు, పందులు సంచరిస్తే వాటి యజమానులపై చర్యలు తీసుకుంటామని కమిషన్ వంశీకృష్ణ భార్గవ్ గురువారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఆవులను యజమానులు రోడ్లపై వదలడంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పందులు కూడా విచ్చలవిడిగా రోడ్లపై సంచరిస్తుండడంతో ప్రజలు అనారోగ్యంబారిన పడుతున్నారన్నారు. ఆవులు గుంపులుగా రోడ్లపై తిరిగితే అనంతపురంలోని గోశాలకు తరలిస్తామన్నారు. పందులను పెంపకందారులు పట్టణానికి పెంపకందార్లు పట్టణానికి దూరంగా పందులను పెంచుకోవాలని హెచ్చరించారు. విచ్చల విడిగా ఆవులను, పందులను రోడ్లపై సంచరిస్తే యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు.

వైభవం..దేవీ నవరాత్రి ఉత్సవం



లలితాదేవి అలంకరణలో కోటలోని వాసవీమాత



శరన్నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక అలంకారంలో అమ్మవారు



బాలత్రిపురసుందరీదేవి అలంకరణలో రాజరాజేశ్వరిదేవి



కణేకల్లులో ప్రత్యేక అలంకరణలో బాల త్రిపురసుందరి



దుర్గా పరమేశ్వరి అలంకరణ

రాయదుర్గంటౌన్: నియోజకవర్గంలోని అమ్మవారి ఆలయాల్లో దేవి శరన్నవరాత్రి వేడుకలు గురువారం నుంచి భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు పట్టణంలోని నగరేశ్వర కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీ మాత లలితాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. శాంతినగర్‌లోని పెద్ద బన్నీ మహంకాళిమాతకు ప్రత్యేక పూజలు, కుంకుమార్చన, అభిషేకాలు చేశారు. ఓబుళాచారి రోడ్డులో వెలసిన బన్నీ మహంకాళి ఆలయానికి భక్తులు పోటెత్తారు. నేసేపేటలోని చౌడేశ్వరీదేవి, కోటలోని కాళికాంబదేవి ఆలయం, హటకేశ్వర స్వామి ఆలయం, మల్లాపురం లేఅవుట్‌లో వెలసిన గజలక్ష్మీదేవి, లక్ష్మీబజారులో వెలసిన శ్రీముదుగులమ్మ ఆలయం, గద్వాలు యల్లమ్మ ఆలయంలో పూజలు చేశారు.

వైభవంగా శ్రీదుర్గాదేవి ఊరేగింపు :
పట్టణంలోని నేసేపేట వరలక్ష్మీ వీధిలో దుర్గాదేవి విగ్రహాన్ని గురువారం ప్రతిష్ఠించారు. తొలుత విగ్రహాన్ని ఊరేగింపుగా పాలబావి వద్ద గంగపూజ చేసి తీసుకొచ్చారు. నవరాత్రి ఉత్సవాల అనంతరం విగ్రహాన్ని నిమజ్జనం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలో స్థానిక మారెంపల్లి కాలనీలో వినాయక సేవా సమితి వారి ఆధ్వర్యంలో శరన్నవరాత్రుల సందర్భంగా గురువారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠించారు. అమ్మవారికి నేడు మొదటిరోజు బాలత్రిపుర సుందరిదేవి అలంకారంలో అమ్మవారు దర్శనం ఇచ్చారు. భక్తులు పూజలు నిర్వహించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

బాలత్రిపుర సుందరీదేవిగా రాజరాజేశ్వరీదేవి
రాయదుర్గంటౌన్: మండలంలోని బొమ్మక్కపల్లి గ్రామంలో వెలసిన రాజరాజేశ్వరీదేవి బాలత్రిపురసుందరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో గురువారం నుంచి విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

కణేకల్లు: కణేకల్లులో శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. దుర్గాదేవి, కనకదుర్గ, కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గాదేవి ఆలయంలో అమ్మవారు బాల త్రిపుర సుందరి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. కనకదుర్గ ఆలయంలో అమ్మవారు దుర్గా పరమేశ్వరిగా దర్శనమిచ్చారు.

స్వర్ణకవచ అలంకరణలో దుర్గాదేవి
వజ్రకరూరు: స్థానిక లలితాత్రిపుర సుందరిదేవి ఆలయంలో శరన్నవరాత్రులను పురస్కరించుకొని గురువారం మొదటిరోజు అమ్మవారు స్వర్ణకవచ అలం కృత దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు అర్చనలు, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

బాలత్రిపుర సుందరిగా చౌడేశ్వరి
ఉరవకొండ: పట్టణంలోని సిండికేట్ బ్యాంకు వద్ద ఉన్న ఉరగాద్రి చౌడేశ్వరి ఆలయం, గుంతకల్లు రోడ్డు వద్ద ఉన్న జగదీశ్వరీ ఆలయాల్లో అమ్మవారు బాలత్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉరగాద్రి చౌడేశ్వరి ఆలయ ధర్మకర్త కొత్తశరత్ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ ధర్మకర్త గాజుల శ్యామలమ్మ ఆధ్వర్యంలో రుద్రసహిత మహా చండీహోమం, నవదుర్గా హోమం, గోపూజ నిర్వహించారు.

లలితాదేవిగా అమ్మవారు దర్శనం
గుమ్మఘట్ట: మండలంలోని తాళ్లకెరలోని వీరభద్రస్వామి ఆలయంలో దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా భద్రకాళి అమ్మవారు లలితాదేవిగా గురువారం దర్శనమిచ్చారు. వేకువజామున మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. దర్శనార్థం వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలను అందించారు.

బ్యాకింగ్ రంగంలో విరివిగా ఉద్యోగావకాశాలు

ఉరవకొండ: నిరుద్యోగులకు బ్యాంకింగ్ రంగంలో విరివిగా ఉద్యోగ అవకాశాలు ఉంటాయని కోచింగ్ సెంటర్ డైరెక్టర్ శేషకుమార్ తెలిపారు. గురువారం ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బ్యాంకింగ్ రంగం – ఉద్యోగావకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మస్తానప్ప అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో వాణిజ్యశాస్త్ర అధ్యాపకులు వెంకటేసులు, అధ్యాపకులు సీతారామ్‌గుప్తా, నాగేంద్రరెడ్డి, ప్రభాకర్, రామాంజనేయులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

గుమ్మఘట్ట: మండలంలోని బీటీపీలో ఓ బాలిక అదృశ్యమైనట్లు హెడ్‌కానిస్టేబుల్ అబ్దుల్ రెహమాన్ గురువారం తెలిపారు. శెట్టూరు మండలానికి చెందిన బాలిక ఆమె తల్లి ఫక్కీరమ్మతో కలిసి బీటీపీ గ్రామంలో ఓ కార్యక్రమానికి బుధవారం హాజరయ్యింది. ఫంక్షన్ అనంతరం బాలిక కనిపించకుండాపోయింది. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.